సాక్షి
అనకాపల్లి
సోమవారం । 28 । అక్టోబర్ । 2024



పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: జేవీవీ చెకుముకి సంబరాల్లో భాగంగా 19 నుంచి నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పావురాల సందడి

ఏయూక్యాంపస్: సాగరతీరంలో కపోతాలు సందడి చేస్తున్నాయి. సందర్శకులు పావురాలకు గింజలు, ఆహారం అందిస్తున్నారు.

చరిత్ర ఘనం.. అభివృద్ధి దైన్యం



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.1.3 కోట్ల నాడు–నేడు నిధులతో చేపట్టిన గునుపూడి హైస్కూల్ అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 60 సంవత్సరాల చరిత్ర ఉన్న పాఠశాల ఇది. అనేకసార్లు ఉత్తమ ఫలితాలను సాధించింది. ప్రగతి పనులు పూర్తి చేస్తే బాగుంటుంది. 8లో

ఆనందం ఆవిరి.. ఆశలు 'గల్లంతు'

పెళ్లి వేడుక ముచ్చట్లు ఇంకా తీరనేలేదు... అవే ఊసులు.. జ్ఞాపకాలతో **సెలవు రోజున** సరదాగా సముద్ర తీరానికి వెళ్లిన స్నేహితులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. **ఇక్కడ స్నానా**నికి దిగిన వారిపై రాకాసి కెరటాలు ఒక్కసారిగా దూసుకొచ్చాయి. రో**జంతా తమతో ఆనం**దంగా గడిపిన మిత్రులిద్దర్ని కళ్ల ముందే లాక్కుపోవడంతో ఒక్కసారిగా **షాక్‌కు గుర**య్యారు. దాంతో రేవుపోలవరం తీరంలో రోదనలు, ఆర్తనాదాలు **మిన్నంటాయి.**



ప్రమాదానికి ముందు జెట్టీపై దిగిన ఫొటో





అర్జున్, సంజయ్‌కుమార్ (ఫైల్)

- స్నేహితురాలి వివాహానికి వచ్చి నీటిపాలైన ఇద్దరు యువకులు
- రేవు పోలవరం తీరంలో లాక్కుపోయిన కెరటాలు
- గల్లంతైన ఇద్దరి కోసం గాలిస్తున్న పోలీసులు



తీరంలో ఆర్తనాదాలు చేస్తున్న కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు

ఎస్.రాయవరం: పెళ్లి సందడి ముగియక ముందే ఎస్సీ కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మండలంలోని కొరుప్రోలు గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఆదివారం రేవుపోలవరం తీరంలో గల్లంతు కావడంతో కాలనీ వాసులంతా అక్కడకు చేరుకుని బోరున విలపించారు. కూలీనాలీ చేసుకుని అల్లారు ముద్దుగా పెంచుకుంటూ చదివిస్తున్న తమ కుమారులు ముందు రోజు పెళ్లి వేడుకలో సందడి చేసి తీరం కెరటాల్లో కొట్టుకుపోయారన్న చేదువార్త బాధిత కుటుంబీకుల గుండెలను పిండేసినట్టుగా అయింది.

విద్యార్థులు తురాల అర్జున్(18), బుంగా సంజయ్‌కుమార్(18) తమ గ్రామంలో స్నేహితురాలు వివాహానికి వచ్చారు. ఆదివారం సెలవు దినం చూసుకుని, చదువుకునే ప్రాంతానికి వెళ్లాల్సి ఉంది. వివాహ వేడుకలో 12 మంది విద్యార్థులు ఒక్క చోట కలుసుకోవడంతో రేవు పోలవరం తీరానికి సరదాగా గడిపేందుకు వెళ్లారు. ఇక్కడ స్నానానికి దిగిన కొంతమందిలో అర్జున్, సంజయ్‌కుమార్ కెరటాల్లో కొట్టుకుపోయారు. గమనించిన తోటి స్నేహితులు కేకలు వేశారు. స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే ఎస్.రాయవరం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఎస్‌ఐ విభీషణరావు, అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ తీరానికి చేరుకుని స్థానిక మత్స్యకారుల సహాయంతో బోటు ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలింపు చేసినా జాడ కనిపించలేదు. అప్పటి వరకు కళ్లముందు తిరిగిన విద్యార్థులు గల్లంతయ్యారన్న వార్తతో కొరుప్రోలు గ్రామంలోనూ రేవుపోలవరం తీరంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. విద్యార్థులు జాడ గుర్తించే వరకు గాలింపు చర్యలు కొనసాగిస్తామని సీఐ రామకృష్ణ చెప్పారు.

ఇద్దరూ పేద విద్యార్థులే...

కొరుప్రోలుకు చెందిన విద్యార్థి అర్జున్ తండ్రి పెట్రోల్ బంకులో పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కుటుంబ విభేదాల కారణంగా తల్లి దూరంగా ఉంటోంది. అర్జున్‌కి చెల్లి ఉంది. పదో తరగతి తర్వాత డిప్లొమాలో ప్రభుత్వ కళాశాల సీటు రావడంతో విజయనగరంలో చదువుకుంటున్నాడు. మరో విద్యార్థి బుంగా సంజయ్ కుమార్ ఎస్.రాయవరం మండలం నర్సీపట్నం రోడ్డు కొల్లేరు ఐటీఐ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తల్లిదండ్రులు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సంజయకుమార్‌కు 7వ తరగతి చదువుతున్న తమ్ముడు ఉన్నాడు. చేతికందొచ్చిన కుమారులు సముద్రంలో గల్లంతయ్యారన్న దుర్వార్తతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

నీటి సంఘాలకు ఎన్నికల సందడి



నీటి సంఘాల ఎన్నికల్లో రైతులే ఓటర్లు

సాక్షి, అనకాపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. వివిధ ఆయకట్ల పరిధిలో సభ్యుల ఎన్నికకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల 21న కలెక్టర్ విజయ కృష్ణన్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21న ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ వచ్చే నెల 29వ తేదీన ముగియనుంది. కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఒక మేజర్, మూడు మీడియం ప్రాజెక్టులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో తాండవ రిజర్వాయర్ మేజర్ జలాశయం కాగా.. రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్లు మీడియం నీటి ప్రాజెక్టులు. 1,25,843 ఎకరాల ఆయకట్టు భూమి రైతులకు ఓటు హక్కు లభిస్తుంది.

కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ

ఈనెల 21న నోటిఫికేషన్ విడుదలైన రోజునే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. పెద్దేరు నీటి ప్రాజెక్టు మినహా మిగతా అన్ని నీటి ప్రాజెక్టులకు గతంలో ఎన్నికలు జరిగాయి. పాత ఓటరు జాబితాలో మరణించిన వారివి, ఆయకట్టు భూములను అమ్మినవారివి తొలగించి...అర్హులైన ఆయకట్టు రైతులను ఓటరుగా నమోదు చేస్తారు. తాండవ, రైవాడ, కోనాం నీటి ప్రాజెక్టుల పరిధిలో ఓటరు జాబితాను అప్‌డేట్ చేస్తారు.

ఇక పెద్దేరు రిజర్వాయర్ పరిధిలో కొత్త ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుంది. ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఆయా మండలాల తహసీల్దార్లను, ఆయకట్టు వివరాలు చూసేందుకు నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరును ఆథరైజ్డ్ అధికారులుగా నియమించారు.

మూడు పద్ధతుల్లో ఎన్నికలు

పదిహేనేళ్ల క్రితం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నీటి సంఘాలకు ఎలాగైతే ఎన్నికలు జరిగాయో.. అదేవిధంగా మూడు పద్ధతుల ద్వారా ఎన్నుకుంటారు. ఏకగ్రీవం, చేతులు ఎత్తడం ద్వారా లేదా చీటీల ద్వారా ఎన్నుకోవడం జరుగుతుంది. నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ శాఖల రికన్సిలియేషన్‌తో ఆయకట్టు పరిధిలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందో గుర్తిస్తారు. ఆయకట్టు పరిధిలో సాగునీటిని వినియోగించుకునే ప్రతీ రైతుకు ఓటరుగా నమోదు చేసుకునే అర్హత ఉంటుంది.

- జోరుగా ఓటరు జాబితాల రూపకల్పన
- జిల్లాలో 16 మేజర్, 28 మీడియం, 259 మైనర్ నీటిసంఘాలకు ఎన్నికలు
- నవంబరు నెలాఖరుకు మొత్తం ప్రక్రియ పూర్తి
- జిల్లాలో 1,25,843 ఎకరాల ఆయకట్టు భూమి రైతులకు ఓటు హక్కు

ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు ఉండాలి

15 ఏళ్ల క్రితం సాగునీటిసంఘాల ఎన్నికలు జరిగాయి. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి. సంబంధిత శాఖల రికన్సిలియేషన్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు ఉంటుంది. లేదంటే ఆయకట్టు నీటితో సాగు చేసుకుంటున్న రైతులకు ఓటు హక్కు ఉండదు. కలెక్టర్ చొరవ తీసుకుని వీలైనంత మేరకు ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు చేపట్టాలి. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో రైతులకు ఓటు హక్కుపై అవగాహన పెంచాలి.

– రెడ్డి అచ్చియ్యనాయుడు, తాండవ ఆయకట్టు రైతు

ఈనెల 31 నుంచి ఓటరు జాబితాల తయారీ

నీటి సంఘాల ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ విజయ కృష్ణన్ వ్యవహరిస్తారు. రిజర్వాయర్ ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు వారీగా, సర్వే నంబర్ ఆధారంగా ఏ టెరిటోరియల్ కమిటీ పరిధిలో ఎంతమంది రైతులున్నారనే విషయం గుర్తింపు ప్రక్రియ ఈ నెల 31న నాటికి పూర్తవుతుంది. ఆ తరువాత నుంచి ఓటరు జాబితా సిద్ధం చేస్తారు. ఎన్నికలు నిర్వహిస్తారు.

– త్రినాథ్, ఈఈ, ఎన్నికల నోడల్ ఆఫీసర్, అనకాపల్లి జిల్లా

ఎన్నికలు జరిగేది వీటికే..

ప్రాజెక్టు కమిటీలు	4
నీటి పంపిణీ సంఘాలు	3
నీటి వినియోగదారుల సంఘాలు	303

ఇదీ షెడ్యూల్

నీటిసంఘాల ఎన్నికలకు సంబంధించిన **నోటిఫికేషన్ ఈనెల** 21న విడుదలైంది.

- **ఈ నెల 31వ** తేదీన ప్రాదేశిక **నియోజకవర్గాల** ప్రచురణ
- **వచ్చే నెల 1, 2 తేదీ**ల్లో ప్రాదేశిక నియో**జకవర్గాల అభ్యంతరా**ల స్వీకరణ
- **3వ తేదీన ప్రాదేశి**క నియోజకవర్గాల **అభ్యంతరాలపై** నిర్ణయం, తుది ప్రచురణ
- 6 నుంచి 10వ తేదీ వరకు భూ యాజమానుల (పట్టాదారులు) ఓటరు జాబితా తయారీ
- 11, 12 తేదీల్లో భూ యాజమానుల ఓటరు జాబితాలపై అభ్యంతరాలు
- 13వ తేదీన భూ యాజమానుల ఓటరు జాబితాల అభ్యంతరాలపై నిర్ణయం
- 14న తుది ఓటరు జాబితా ప్రకటన
- 20న నీటియాజమాన్య సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికల ప్రకటన
- 23వ తేదీన నీటి వినియోగదారుల సంఘాలకు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి పదవులకు ఎన్నిక
- 26వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల ఎన్నిక
- 29వ తేదీన ప్రాజెక్టు కమిటీ(పీసీ)ల ఎన్నిక

ఎన్నికలు సాగేదిలా..

జిల్లాలో 16 మేజర్, 28 మీడియం, 259 మైనర్ నీటిసంఘాల అధ్యక్షుల ఎన్నికలు జరుగుతున్నాయి. జిల్లాలో మేజర్ ప్రాజెక్టు తాండవ కాగా.. మీడియం ప్రాజెక్టులుగా రైవాడ, కోనాం, పెద్దేరు నీటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవి కాక మైనర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రాజెక్టు కమిటీ (పీసీ) చైర్మన్‌గా ఎన్నిక కావాలంటే తొలుత ప్రాదేశిక సభ్యుడు కావాల్సి ఉంటుంది.

మేజర్ ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్: తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో అనకాపల్లి జిల్లా, కాకినాడ జిల్లాలకు సాగునీరు అందుతోంది. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల్లోని భూములకు సాగునీరు అందుతోంది. అనకాపల్లి జిల్లాలో 192 మంది ప్రాదేశిక సభ్యులు,



తాండవ జలాశయం

కాకినాడ జిల్లా పరిధిలో 120 మంది ప్రాదేశిక సభ్యులు ఉన్నారు. ప్రతి నీటివినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ)లో 12 సభ్యులు ఉండి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అలా రెండు జిల్లాల నుంచి 26 మంది ఎన్నికవుతారు. వీరి నుంచి అనకాపల్లి జిల్లా పరిధిలో ముగ్గురు, అనకాపల్లి జిల్లా పరిధిలో ఇద్దరు నీటి పంపిణీ సంఘాల (డిస్ట్రిబ్యూటరీ కమిటీ–డీసీ)లకు సభ్యులుగా ఎంపికవుతారు. వీరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

మీడియం ప్రాజెక్టులు : రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాలు మధ్యతరహా నీటి ప్రాజెక్టులు. వీటికి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండవు. నీటి సంఘాల ప్రెసిడెంట్ల ద్వారా నేరుగా ప్రాజెక్టు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మీడియం ప్రాజెక్టుల పరిధిలో 96 మంది ప్రాదేశిక సభ్యులు ఉంటారు. వీరు డబ్ల్యూయూఏ అధ్యక్షులను ఎన్నుకుంటే.. వీరి ద్వారా డైరెక్ట్‌గా ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక జరుగుతుంది.

మైనర్ ప్రాజెక్టులు : మైనర్ ప్రాజెక్టులకు ప్రాజెక్ట్ చైర్మన్ ఎన్నిక ఉండదు. చెరువులు, చిన్నపాటి నీటివనరులకు సంబంధించిన చిన్నతరహా ప్రాజెక్టుల పరిధిలోని 259 నీటి సంఘాలకు మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. ప్రాదేశిక సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

లక్ష్యం...ఉన్నత శిఖరం



చంద్రశిల పర్వతం అధిరోహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

- గ్రూపు–2 అధికారి సాహసం
- హిమాలయాల్లోని చంద్రశిల పర్వతారోహణం
- క్రీడలు, ట్రెక్కింగ్, సమాజసేవ ప్రవృత్తిగా..
- చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి సాహస యానం

చోడవరం : కృషి, పట్టుదల ఉంటే ఎంతటి శిఖరాన్నయినా అధిరోహించవచ్చని చాటి చెబుతున్నారామె. ఉద్యోగంలో ఎంత వత్తిడి, బిజీగా ఉన్నప్పటికీ తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్ని విధాలుగా నిరంతరం కృషి చేస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు గీతాలక్ష్మి. హిమాలయాల్లోని ఎత్తయిన పర్వతాల్లో ఒకటైన సముద్ర మట్టానికి 12,110 అడుగుల ఎత్తులో ఉన్న చంద్రశిల పర్వతాన్ని అధిరోహించి మహిళలు ఎందులోనూ తీసిపోరని మరోసారి రుజువు చేశారు. వృత్తి రీత్యా సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నప్పటికీ క్రీడలు, అథ్లెటిక్స్, సమాజ సేవా కార్యక్రమాలే ప్రవృత్తిగా గీతా లక్ష్మి కృషి చేస్తున్నారు. సాహస కృత్యాల పట్ల ఆసక్తి చూపే మహిళలకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు.

చంద్రశిల పర్వతం.. కఠోర మార్గం

హిమాలయ పర్వతాలను అధిరోహించిన వారిలో మహిళలు అతి తక్కువ మంది మాత్రమే. ఉత్తరాఖండ్‌లోని హిమపర్వత సానువుల్లో సముద్ర మట్టానికి 12వేల 110 అడుగుల ఎత్తున చంద్రశిల పర్వతం. ఈ పర్వతం ఎక్కాలంటే ముందుగా పట్టుదలతో పాటు అక్కడున్న అతి శీతల వాతావరణం తట్టుకోగల శక్తి ఉండాలి. ఇక్కడ 2 అంతకంటే తక్కువ డిగ్రీల సెల్సియస్‌లో ఉష్ణోగ్రత ఉంటుంది. ప్రతికూల వాతావరణంలో చంద్రశిల పర్వతారోహణకు కనీసం 4 రోజులు పడుతుంది. అంతే కాకుండా అడవులు, కొండ చరియలు, ప్రాణాలు హరించే జంతువులు వీటన్నింటి నుంచి భయం లేకుండా ముందుకు వెళ్లే స్థయిర్యం ఉండాలి. అటువంటి సాహస కృత్యాన్ని గీతాలక్ష్మి సాధించారు.

సాహస యానం ఇలా..

పర్వతారోహణ చేయడం తనకున్న జీవిత లక్ష్యాల్లో ఒకటి కావడంతో ఆ దిశగా అడుగులు వేశారు గీతాలక్ష్మి. ఇప్పటికే తూర్పు కనుమల్లో అతి పెద్దదైన 5,540 అడుగుల ఎత్తయిన జిందఘడ పర్వతాన్ని అధిరోహించిన ఆమె హిమాలయ పర్వతాల్లో 12,110 అడుగుల ఎత్తయిన చంద్రశిల పర్వతారోహణ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇండియాలో పర్వతారోహణకు సహకరించే ఇండియా హైక్స్ అనే ట్రెక్కింగ్ సంస్థ సహకారంతో ఈ పర్వతారోహణ చేశారు. ఆమె భర్త కూడా ఆమెతో పాటు పర్వతారోహణకు రావడంతో గీతాలక్ష్మి లక్ష్యానికి మరింత బలం చేకూరింది. ఈనెల 22వ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రప్రయాగ జిల్లా సారి అనే గ్రామం నుంచి ఆమె పర్వతారోహణ ప్రారంభించి 25వ తేదీన శిఖరాన్ని అధిరోహించారు. 32 కిలోమీటర్ల మేర సాగిన ఈ ట్రెక్కింగ్‌లో నాలుగు రోజుల సమయం పట్టింది. మొదటి రోజు 4 కిలోమీటర్లు, రెండో రోజు 9 కిలోమీటర్లు, మూడోరోజు 5 కిలోమీటర్లు, 4వ రోజు 14 కిలోమీటర్లు మేర సాగింది. దట్టమైన అడవుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా టెంట్లలోనే జీవనం. 3 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఎముకలు కొరికే చలిలో 7 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ స్టిక్స్‌తో కాలినడక ప్రయాణం. ఎట్టకేలకు 12,110 అడుగుల ఎత్తయిన చంద్రశిల పర్వతం శిఖరాన్ని అధిరోహించి ఉత్తరాంధ్రలో పర్వతారోహణ చేసిన అతికొద్ది మందిలో ఒకరిగా నిలిచి ఔత్సాహిక మహిళలకు స్ఫూర్తిగా గీతాలక్ష్మి నిలిచారు.

వ్యవసాయ కుటుంబం నేపథ్యం...

చోడవరం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గీతాలక్ష్మి మొదట్నుంచి క్రీడాకారిణిగా రాణిస్తూ వచ్చారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఆమె వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో టీచర్‌గా తన వృత్తిని ప్రారంభించిన ఆమె 2009లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు–2 పరీక్షలో విజయం సాధించి సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారు. భర్త చంద్రరావు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటల్లోనూ మేటి..

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ శ్రీకాకుళం జవహర్ నవోదయ పాఠశాలలో చదివిన గీతాలక్ష్మి మొదట్నుంచి క్రీడల్లో ఆసక్తి చూపుతూ అనేక బంగారు పతకాలు సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ ఆటల్లో పతకాలు సాధించిన ఆమె ఇటీవల రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో రన్నింగ్, లాంగ్‌జంప్, డిస్క్‌త్రో విభాగాల్లో 20 మెడల్స్ సాధించారు. అనేక సంఘ సేవా కార్యక్రమాల్లో తన వంతుగా సాయం అందిస్తూ, సమాజసేవ చేస్తున్నారు.

ఎవరెస్ట్.. నా తదుపరి టార్గెట్



లక్ష్యం పెట్టుకుంటే ఏదైనా సాధించగలననే నమ్మకం నాకుంది. ఇప్పటి వరకూ నేను అనుకున్న లక్ష్యాలన్నీ ఇంచుమించుగా సాధించాను. హిమాలయ పర్వతాల్లో ఒకటైన చంద్రశిల పర్వతాన్ని ఈ వారంలో ఎక్కాను. చాలా కష్టమే అయినా పట్టుదలతో సాధించాను. ఈ ఎత్తయిన పర్వతం ఎక్కడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. ఈ పర్వతం ఎక్కడానికి మైనస్ డిగ్రీల చలిలో 4 రోజుల పాటు సాహస ప్రయాణం చేశాం. చాలా ఆనందంగా ఉంది. ఎప్పటికైనా ఎవరెస్ట్ ఎక్కాలన్నది నా ఆశయం. అందుకు తగ్గ కృషి చేస్తాను.

– గీతాలక్ష్మి



ఎత్తయిన చంద్రశిల పర్వతం అధిరోహించిన బృందంలో గీతాలక్ష్మి



మంచు కొండ అగ్ర భాగాన..

నేడు జిల్లా అభివృద్ధిపై సమీక్ష

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాక

సాక్షి, అనకాపల్లి: జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు పాల్గొంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులయ్యాక తొలిసారిగా జిల్లాకు వస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తొలుత పెంటకోట కన్వెన్షన్ హాల్లో కూటమి పార్టీల నాయకులతో భేటీ అవుతారు. అనంతరం కశింకోట మండలంలో గల విశాఖ డిస్టిలరీని సందర్శిస్తారు. ఆ తర్వాత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న డీఆర్‌సీ సమావేశానికి హాజరవుతారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

- అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా



సాక్షి, అనకాపల్లి: అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించిన వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా క్రాకర్స్ తయారుదారులు గానీ.. విక్రయించే దుకాణదారులు గానీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా ఎవరూ బాణసంచా అమ్మకూడదన్నారు. జిల్లాలో శాశ్వత – తాత్కాలిక బాణసంచా తయారీ లేదా విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే క్రాకర్స్ అమ్మాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డుల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, హాస్పిటళ్లకు దూరంగా విక్రయాలు స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

104 ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక


ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం సభ్యులు

అనకాపల్లి: స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం 104 రాష్ట్ర కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎం.నాగసాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా వి.వి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.అప్పలరమణ, కోశాధికారిగా జి.చంద్రుడు, ఉపాధ్యక్షురాలిగా ఎస్.సూర్యకళ, వర్కింగ్ ఉపాధ్యక్షుడిగా ఎ.మనీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.భార్గవ్, డివిజన్ లీడర్లుగా కిషోర్, శివలక్ష్మి(నర్సీపట్నం), రాజబాబు, మధు(అనకాపల్లి), చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎం.నాగసాయి మాట్లాడుతూ 104 ఉద్యోగులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లభించడం లేదన్నారు. ఆప్కాస్ నిర్ణయించిన వేతనం రూ.18,500 కన్నా తక్కువ జీతానికి పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం 104 ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది.

మైహోమ్ ఇండస్ట్రీస్ సేవలకు కలెక్టర్ ప్రశంస


కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మైహోమ్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ చౌదరి

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చేస్తున్న సేవలను కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ప్రశంసించారు. సీఎస్ఆర్ నిధులతో ఈ పరిశ్రమ యాజమాన్యం యలమంచిలి పట్టణంలో ఉన్న బీసీ సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఆధునికీకరించడంపై వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు మైహోమ్ ఇండస్ట్రీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(వర్క్స్) వీహెచ్ చౌదరికి కలెక్టర్ ప్రశంసా పత్రం అందజేశారు. తమ సేవలను గుర్తించినందుకు వీహెచ్ చౌదరి కలెక్టర్, జేసీలకు ధన్యవాదాలు తెలిపారు.

దేవరాపల్లిలో యథేచ్ఛగా గ్రామ కంఠ స్థలాల విక్రయం

- తప్పుడు సర్వే నంబర్‌తో పాత డంపింగ్ యార్డు స్థలం అమ్మకం
- సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం




దేవరాపల్లిలో అన్యాక్రాంతమవుతున్న పాత డంపింగ్ యార్డు స్థలం

దేవరాపల్లి: మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో గ్రామ కంఠ స్థలాలను స్థానిక నాయకుడు ఒకరు యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 259/2లో ఇప్పటికే కోట్లు విలువ చేసే గ్రామ కంఠ స్థలాలను అమ్మకాలు చేపట్టారని, సదరు వ్యక్తి ఎవరో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు.. కళ్ల ముందే కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతుంటే ప్రేక్షక పాత్ర వహించడం పలు విమర్శలకు తావిస్తుందన్నారు. గతంలో కొబ్బరి తోట, పాత డంపింగ్ యార్డు స్థలాలకు విక్రయించేందుకు సిద్ధపడగా అప్పట్లో సీపీఎం అడ్డుకుందన్నారు. ఆ తర్వాత పాత డంపింగ్ యార్డులోని కొంత స్థలంలో గ్రామ సచివాలయ భవనం, కొబ్బరి తోట స్థలంలో విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించారన్నారు. ప్రస్తుతం పాత డంపింగ్ యార్డు వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని విక్రయించేందుకు సిద్ధపడగా.. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారన్నారు. ఆ తర్వాత తప్పుడు సర్వే నంబర్‌తో గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి కోటి రూపాయలకు పైగా దోచుకున్నారని విమర్శించారు. సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, ప్లాన్ అప్రూవల్ ఇవ్వద్దని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు గ్రామ కంఠ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పరిరక్షించకపోతే స్థానిక ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

రూ. 28 కోట్లతో కేజీహెచ్‌లో క్యాన్సర్ విభాగం ఆధునికీకరణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు ఉచిత చికిత్స అందజేస్తున్నామని, ఇందులో భాగంగా క్యాన్సర్ విభాగాన్ని ఆధునికీకరించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం 30వ వార్డు సాలిపేట కమ్యూనిటీ హాల్లో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ అవగాహన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగంలో రూ. 28 కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతిక పరికరాలైన లినాక్ మిషన్ సమకూర్చుకోగలిగినట్లు చెప్పారు. దీని సాయంతో ఐదు నుంచి పది లక్షల రూపాయలు ఖర్చు కాగల వైద్యాన్ని కేజీహెచ్‌లో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో నొప్పి ఉన్నా లేకపోయినా మెమోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుందని తెలిపారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ క్యాన్సర్ నాలుగు స్టేజిల్లో ఉంటుందని తెలిపారు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే నయం అవుతుందన్నారు.


దాత సాయంతో ఏర్పాటు చేసిన సైన్స్ పరికరాలు


హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు(ఫైల్)


క్రీడల్లో ప్రతిభ చాటి కలెక్టరు విజయకృష్ణన్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న విద్యార్థిని ప్రశాంతి (ఫైల్)

చరిత్ర ఘనం.. అభివృద్ధి దైన్యం

- రూ.1.3 కోట్ల నాడు–నేడు నిధులతో గునుపూడి హైస్కూల్‌లో అభివృద్ధి పనులు
- కూటమి ప్రభుత్వం నిధులు నిలిపేయడంతో ఆగిన పనులు
- సౌకర్యాల లేమితో విద్యార్థుల అవస్థలు

ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న చదువుల బడి అది. ఎంతో మంది ఉన్నతికి బాటలు వేసిన సరస్వతీ నిలయమది. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద మంజూరు చేసిన నిధులను సైతం కూటమి సర్కారు నిలిపివేయడంతో గునుపూడి హైస్కూల్‌లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.


నాడు–నేడు నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా అదనపు భవన నిర్మాణం

నాతవరం: గునుపూడిలో 1961లో హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఈ హైస్కూల్ సుమారుగా ఐదెకరాల విస్తీర్ణంలో ఉంది. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలు సరిహద్దులో ఉండడంతో రెండు జిల్లాల పరిధిలో ఉన్న అనేక గ్రామాల విద్యార్థులు ఇక్కడ ఎక్కువగా చదువుకున్నారు. అప్పట్లో మండల వ్యవస్థ ఏర్పాటు కాకముందు నాతవరం మండలంలో ఎక్కడ కూడా హైస్కూల్ లేదు. గునుపూడిలోనే ఉండేది. ప్రస్తుతం హైస్కూల్‌లో సుమారుగా 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యతో పాటు ఆట పాటల్లోనూ ఇక్కడి విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రతి ఏటా పదో తరగతిలో మంచి ఉత్తీర్ణతతో సత్తా చాటుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో 15 మంది వరకు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పలువురు విద్యార్థులు కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఆగిన పనులు.. నిలిచిన అభివృద్ధి

అలాంటి హైస్కూల్‌లో మౌలిక సదుపాయాల లేమి వేధిస్తోంది. గత ప్రభుత్వం నాడు–నేడు పథకం రెండో విడతలో రూ.1.30 కోట్లతో పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వసతి సముదాయం కల్పనలో భాగంగా అదనపు భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంత వరకు పనులు చేపట్టగా.. ప్రస్తుత ప్రభుత్వం నాడు నేడు పథకంలో నిధులు నిలుపుదల చేసింది. నిధులు రాకపోవడంతో హైస్కూల్‌లో అసంపూర్తి నిర్మాణంతో భవనాలు వెక్కిరిస్తున్నాయి. సువిశాలమైన ఆట స్థలం ఉన్నప్పటికీ ప్రహరీ లేదు. నాడు–నేడు రెండో విడత నిధులతో ప్రహరీ నిర్మాణానికి అవకాశం ఉండేది. స్కూల్‌కు రక్షణ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి రోజు రాత్రి వేళలో ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాడు–నేడు పథకం నిధులు విడుదల చేసి, పాఠశాల అభివృద్ధికి దోహద పడాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం

గునుపూడి హైస్కూల్ ఏర్పాటు చేసి అక్టోబరు 2021 నాటికి 60 ఏళ్లు పూర్తి కావడంతో పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో 2 వేల మందితో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. హైస్కూల్ హెచ్‌ఎం టి.వి.శివ జ్యోతి ప్రత్యేక కృషితో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో 300 మొక్కలు నాటించారు. వాటిని సంరక్షించే బాధ్యత పిల్లలకు అప్పగించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కొంత సహకారం అందిస్తున్నారు. దాతల సాయంతో విద్యార్థులకు తరచూ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు.

ఇక్కడ చదువుకోవడానికి ఎంతో ఆసక్తి



గునుపూడి హైస్కూల్‌లో చదువుకున్న వారు అనేక మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. విదేశాల్లోనూ స్థిరపడిన వారు ఉన్నారు. నా చిన్నతనంలో రెండు జిల్లాల పరిధిలో అనేక మంది ఈ హైస్కూల్‌లో చదువుకోవడానికి ఆసక్తి కనబరిచేవారు. సదుపాయాలు కల్పిస్తే ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి బాటలు వేయవచ్చు.

– పి.చిట్టిబ్బాయి, పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్

పచ్చదనానికి కృషి



దాతల సహకారంతో గునుపూడి హైస్కూల్‌లో పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నాం. విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. హైస్కూల్ అభివృద్ధికి దాతలతో పాటు ప్రజాప్రతినిధుల సహకారం అవసరం.

– టి.శివజ్యోతి, గునుపూడి హైస్కూల్ హెచ్‌ఎం

నాడు–నేడు నిధులు ఆగిపోయాయి..



నాడు–నేడు రెండో విడత నిధులు పూర్తిగా అంది ఉంటే అదనపు భవనాల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చేవి. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులు ప్రస్తుతం నిలిచిపోయాయి. గునుపూడి హైస్కూల్‌కు మండల స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆటల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. అసంపూర్తి భవనాల పూర్తికి కృషి చేస్తాం.

– కామిరెడ్డి వరహాలబాబు, ఎంఈవో–2

ఏసీ బోగీల్లో చోరీలు.. యలమంచిలి యువకుడి అరెస్ట్


తుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసిన దుర్గాప్రసాద్

యలమంచిలి రూరల్: రైళ్లలో ఏసీ కోచ్‌ల్లో ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న 19 ఏళ్ల యువకుడ్ని తుని రైల్వే పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. యలమంచిలి పట్టణం ధర్మవరం వీధికి చెందిన నరాలశెట్టి జ్యోతీసు దుర్గాప్రసాద్ చిన్నతనం నుంచే నేరాల బాట పట్టాడు. దీంతో తల్లిదండ్రులు యువకుడ్ని గత కొద్ది రోజుల నుంచి ఇంటికి రానివ్వడంలేదు. నిందితుడు గోదావరి, విశాఖ, మచిలీపట్నం రైళ్లతో పాటు పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొద్ది రోజులుగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఏసీ బోగీల్లో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో వారి విలువైన బంగారు ఆభరణాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, మొబైల్ ఫోన్లను అపహరించుకుపోవడంలో ఆరితేరిపోయాడు. చోరీ చేసిన తర్వాత చాకచక్యంగా రైలు ఆగే తర్వాతి స్టేషన్‌లో దర్జాగా దిగి వెళ్లిపోతాడు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో నిఘా పెట్టిన పోలీసులు.. యువకుడ్ని ఆదివారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 47 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6వేలు నగదు స్వాధీనపర్చుకున్నారు. నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారుగా రూ.3,11,500 ఉంటుందని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించి విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగించుకోవాలని కూటమి ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ పాత పద్ధతి కంటే ఎక్కువ యాప్‌లతో ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. బోధనా సమయాన్ని దాని కోసమే వినియోగించేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40 వరకు యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ పనులు చేయడం వల్ల సమయమంతా వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ మీటింగులు, వృత్యాంతర శిక్షణ తరగతులు, ఆన్‌లైన్ పనులు ఉపాధ్యాయులకు తీవ్రమైన తలనొప్పిగా మారాయన్నారు. కొద్ది సమయాన్ని బోధనకు వినియోగించవలసిన అవసరం ఉండగా, ఆన్‌లైన్ పనులు, బోధనేతర పనులు ఉపాధ్యాయుల సమయాన్ని హరించి వేస్తున్నాయని వాపోయారు. బోధనేతర పనులకు వేరే ఉద్యోగులను వినియోగించుకోవాలని కోరారు. ఎంఈవోలను సైతం బోధనేతర పనులకు వాడుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'మన ఇల్లు మన గౌరవం, 'సామాజిక పింఛన్ల పంపిణీ'కి వారిని వినియోగించడం వల్ల ఉపాధ్యాయులు, పాఠశాలలపై ఎంఈవోల పర్యవేక్షణ తగ్గుతుందన్నారు. స్కూళ్ల అభివృద్ధి కోసం, పర్యవేక్షణ కోసం మాత్రమే ఎంఈవోలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శులు శేషుకుమార్, కళింగ సతీష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, మున్సిపల్ ఉపాధ్యాయ నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, నాతవరపు సతీష్, జగన్, శాస్త్రి, లోవరాజు, దేవుడు నాయుడు, శ్రీనివాస్, శివప్రసాద్, అప్పలరాజు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జీఎన్ఏ రాష్ట్ర కోశాధికారిగా గంగాభవానీ


ఎన్నికల అధికారి నుంచి ధ్రువ పత్రం తీసుకుంటున్న గంగాభవానీ

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా టి. గంగాభవానీ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి గంగాభవానీ పోటీ చేయగా అత్యధిక మెజార్టీతో గెలిచి కోశాధికారి పదవి కైవశం చేసుకున్నారు. ఆమె ఇప్పటికే విశాఖ జిల్లా ఏపీజీఎన్ఏ జిల్లా అధ్యక్షురాలిగా కూడా ఇటీవల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రస్థాయిలో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో ఆమె పోటీ చేయగా కీలక స్థానం లభించింది. గంగాభవానీ నియామకం పట్ల విశాఖ జిల్లాకు చెందిన నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. ఇందిర, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, కోశాధికారి వంశీ, పాలకవర్గ సభ్యులతో పాటు విశాఖ జిల్లాలోని పలు ఆస్పత్రులకు చెందిన నర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సరుగుడులో సండే సందడి


కొండల మధ్యలోంచి జాలువారుతున్న నీటిలో సందర్శకుల జలకాటాలు

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారుతున్న నీటిలో జలకాటాలు ఆడేందుకు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలక్షేపం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వీరు తరలి రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం చోటు చేసుకుంది. అదేవిధంగా తాండవ రిజర్వాయరు వద్ద సందర్శకుల తాకిడి కనిపించింది. ఇక్కడ ప్రాజెక్టు దిగువనున్న నల్లగొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని పార్కులో ఆటపాటలతో సరదాగా గడిపారు.





లేజర్ అదుర్స్ షో

జీవీఎంసీ, తూర్పునావికా దళం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని విక్టర్ ఎట్ సీ స్థూపంపై సాగిన సౌండ్ లేజర్ షో అబ్బురపరిచింది. 1971 నౌకాదళం యుద్ధం, విశాఖ నగరం పాత్ర, యుద్ధవీరుల సాహసాలు, దేశ భద్రత కోసం పహారా కాస్తున్న సైనికులు, దేశ చరిత్రను తెలిపే విధంగా ఈ లేజర్ షో సాగింది. పెద్ద సంఖ్యలో నగరవాసులు షోను వీక్షించారు. ప్రతీ ఆదివారం లేజర్ షో ఉంటుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు. –ఏయూక్యాంపస్

క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు


గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారి వీధిలో గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. శనివారం రాత్రి నుంచి పట్టణ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. సోమవారం తెల్లవారు జామున అమ్మవారి ఆలయంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు అబ్బులు మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని 1811లో స్థాపించారని, అప్పటి నుంచి నేటి వరకూ అమ్మవారి నిలుపు మహోత్సవం జరుగుతుందన్నారు. డిసెంబర్‌లో అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవనంగా నిర్వహిస్తామన్నారు. కార్తీకమాసం నెలరోజుల అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పల్లె పండగ వాయిదా

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం, ఏనుగుతుని, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో సోమవారం జరగాల్సిన పల్లె పండగ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ ఆదివారం తెలిపారు. మళ్లీ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

లోక్ జనశక్తి పార్టీ పట్టణాధ్యక్షుడిగా భరణి

అనకాపల్లి: లోక్ జనశక్తి పార్టీ పట్టణ అధ్యక్షునిగా ఎ.ఎస్.భరణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఉడ్‌పేట పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కర్రి వరహా నూకరాజు, సహాయ కార్యదర్శిగా వై.పైడిశెట్టి, కోశాధికారిగా ఎస్.ఎ.బాషా, ఉపాధ్యక్షుడిగా పి.చిన్నబ్బాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాల పాటు ఉంటుందని అధ్యక్షుడు ఎ.ఎస్.భరణి తెలిపారు. ప్రజల సమస్యలు కోసం నిత్యం పోరాటాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఘనంగా గౌరమ్మ ఉత్సవాలు


జమాదులపాలెంలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో శనివారం రాత్రి నిర్వహించిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో ట్రాక్టర్లలో గౌరమ్మ విగ్రహాలను నిలిపి ఊరేగించి నిమజ్జనం చేశారు. ఎక్కువ సంఖ్యలో మహిళలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
వీణం 3డి 2	: సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పరిసాయి
వేట్టయాన్	: షిర్డీసాయి
నరుడి బతుకు నటన	: వెంకటేశ్వర
ఎంత పనిచేసావ్ చంటి	: శ్రీసత్య
పొట్టేల్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 337 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 243 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924 - 223595 నంబరును సంప్రదించవచ్చు.


ఈ చిత్రంలో చిన్నారి పేరు మొల్లి తేజో వికాస్.. శారీరక వైకల్య సమస్య వల్ల నడవ లేక పోయేవాడు. రోలేటర్ సహాయంతోను, అమ్మమ్మ ఎత్తుకొని భవిత కేంద్రానికి తీసుకు వచ్చేవారు. ఇక్కడ ఏడాదిగా ఫిజియోథెరపీ చేయడం వల్ల నడవ గలుగుతున్నాడు. తన పనులు తానే చేసుకోగలుగుతున్నాడు.


ఈ చిత్రంలో చిన్నారి పేరు పాలమరశెట్టి దినేష్.. గతంలో వినికిడి సమస్యతో బాధపడుతుండేవాడు. సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన వినికిడి యంత్రాన్ని సమకూర్చారు. దీంతో వినగలిగే అవకాశం కలిగింది. భవిత కేంద్రంలో సైగలతో విద్యా బోధన సాగించడంతో క్రమేణా చదవడం నేర్చుకోగలుగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఈ చిత్రంలో చిన్నారి పేరు యలంశెట్టి శ్రావణి.. మొదట్లో నడవ లేక ఇబ్బంది పడుతూ దేకుకుంటూ, తల్లిదండ్రుల సహాయంతో భవిత కేంద్రానికి వచ్చేది. ఇక్కడ రూ.20 వేలతో వీల్ చైర్ సమకూర్చడంతో దాని సహాయంతో కేంద్రానికి ఇప్పుడు రాగలుగుతోంది. ఫిజియోథెరపీ చికిత్స అందిస్తుండటం వల్ల తల్లిదండ్రుల సహాయంతో చిన్నగా నడవగలుగుతోంది.

దివ్యాంగుల 'భవిత'కు భరోసా

- ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా కశింకోట భవిత కేంద్రం
- మనోస్థైర్యం పెంచేలా శిక్షణ
- నిత్యం ప్రత్యేక కృత్యాలతో మెలకువలు

మానసికంగా, శారీరకంగా వైకల్యం ఉన్న బాలబాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యనందించి సాధారణ విద్యార్థులుగా భవిత కేంద్రం తీర్చిదిద్దుతోంది. మనోస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో శిక్షణనందిస్తోంది. నిత్య కృత్యాలతోపాటు విద్య, స్పీచ్ థెరపీ, తదితరాల్లో వారికి మెలకువలను నేర్పిస్తోంది. పుట్టుకతో, చిన్న వయసులో వైకల్యం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి భరోసానిస్తోంది.


దివ్యాంగ విద్యార్థులకు బోధన సాగిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయినులు

కశింకోట: దివ్యాంగుల భవితవ్యానికి భవిత కేంద్రం బాటలు వేస్తోంది. విద్యా పరంగా, శారీరకంగా, మానసికంగా పరివర్తన తీసుకొచ్చి సరిదిద్దుతోంది. మూగ వారికి స్పీచ్ థెరపీ ద్వారా మాట్లాడించడం, ఫిజియోథెరపీ ద్వారా శారీరక వైకల్య సమస్యలను అధిగమించడం జరుగుతోంది. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కశింకోటలోని భవిత కేంద్రాన్ని 2005లో ఏర్పాటు చేశారు. దీన్ని స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుకుంటూ తమ మానసిక, శారీరక రుగ్మతలను మెరుగుపర్చుకుంటున్నారు. కేంద్రంలో ఐఈఆర్పీ (ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్)లు బి.వి.రమణమ్మ, దీప వీరికి బోధన సాగిస్తున్నారు.

వివిధ పద్ధతులతో బోధన...


కశింకోటలోని బాలికల హైస్కూలులో ఉన్న భవిత కేంద్రం

దివ్యాంగ విద్యార్థుల సమస్యలను గుర్తించి నిత్యం ప్రత్యేక కృత్యాల ద్వారా మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రధానంగా వినికిడి సమస్యలున్న వారికి సైగల ద్వారా, దృష్టి లోపం ఉన్న వారికి ముద్ద అక్షరాలు, పెద్ద అక్షరాలు వినియోగించడం, బ్రెయిలీ లిపి, మెదడు సమస్యలున్న వారికి పండ్లు, కూరగాయలు వంటి బొమ్మల ద్వారా బోధన సాగిస్తున్నారు. అలాగే రంగులు, నగదు గుర్తించడం, ద్రవ్య మానం లెక్కించడం, టీఎల్‌ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్) సామగ్రి విధానం ద్వారా బోధిస్తూ తీర్చిదిద్దుతున్నారు. వారి వైకల్య సమస్యలు మెరుగుపడిన తర్వాత ఉన్నత చదువులకు హైస్కూళ్లకు సిఫార్సు చేస్తున్నారు.

ఫిజియోథెరపీతో మెరుగు..

ఫిజియోథెరపీ చికిత్స ద్వారా శారీరక వైకల్యాలను మెరుగుపర్చడానికి ఫిజియోథెరపిస్టు గీతా మోనికను నియమించారు. ఆమె వారానికి ఒకసారి వచ్చి ప్రత్యేక అవసరాల విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. దీంతో నడవ లేని వారి నడక మెరుగుపడుతోంది. ఇతర రుగ్మతలు తీరుతున్నాయి. దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రానికి రోజూ తీసుకొచ్చి సాయంత్రం తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. కేంద్రంలో దివ్యాంగుల పరిస్థితి మెరుగుపడటంతోపాటు విద్య అందుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ద్వారా హైస్కూళ్లలో 9, 10 చదువుతున్న 18 మంది విద్యార్థులకు గతేడాది రూ.3.5 లక్షలు కేంద్ర ఉపకార వేతనాన్ని అందించారు.

అదనంగా గది కేటాయించాలి..

కేంద్రానికి ఒకే గది కేటాయించడం వల్ల అది బోధనకు సరిపోవడం లేదు. అదనంగా గదిని సమకూర్చాల్సి ఉంది. దివ్యాంగులకు బోధనకు కావలసిన సామగ్రి పూర్తిగా అందుబాటులో లేవు. టీఎల్‌ఎం సామగ్రి, ఎంఆర్ కిట్లను సరిపడగా అందించాల్సి ఉంది. వీటిని కల్పించి సదుపాయాలను మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

వైకల్య సమస్యలు అధిగమించేలా బోధన

భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సమస్యలను గుర్తించి అందుకు అనుగుణమైన విధానంలో బోధిస్తూ వారిని తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం. సైన్ లాంగ్వేజ్, టీఎల్‌ఎం పరికరాలు, బ్రెయిలీ లిపి, నగదు, రంగుల గుర్తింపు విధానం తదితర పద్ధతుల్లో బోధన సాగిస్తున్నాం. వైకల్యం ఉన్న వారికి ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నాం. దీంతో పలువురు దివ్యాంగ విద్యార్థులు వైకల్య సమస్యలు అధిగమిస్తున్నారు.

– బి.వి. రమణమ్మ, ఐఈఆర్పీ ఉపాధ్యాయిని, భవిత కేంద్రం, కశింకోట

క్యారీ లారీలతో పట్టణ ప్రజల బెంబేలు


విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద క్యారీ లారీలో నుంచి పడిపోయిన రాయి

అనకాపల్లి: పట్టణ పరిధిలో క్యారీ లారీలు భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే అధికారులు ట్రాక్‌కు ఇరువైపులా భారీ గిల్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ మోతాదుకు మించిన అధిక లోడ్‌తో క్యారీ లారీలు వెళ్లడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద లారీ నుంచి పెద్ద బండరాయి కింద పడిపోయింది. ఆదివారం కావడం జనసంచారం ఎక్కువగా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండలంలో క్యారీల ద్వారా నిత్యం వందలాది భారీ లారీలు పట్టణం మీదుగా రాత్రి, పగలు అనే తేడాలు లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. స్థానిక నెహ్రూ చౌక్ వద్ద లారీలో నుంచి రాళ్లు పడిపోవడంతో కొన్ని సమయాల్లో ప్రమాదాలకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనిపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు కోరారు.

స్థిరంగా కోనాం నీటిమట్టం



చీడికాడ : కోనాం జలాశయం నీటిమట్టం స్థిరంగా కొనసాగుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 98.30 మీటర్లు వద్ద కొనసాగుతుంది. ఖరీఫ్ పంటలకు ఎగువ, దిగువ కాలువల ద్వారా 200 క్యూసెక్కులు విడుదలవుతుంది. ఇన్ ఫ్లో 20 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే నెలలో 93.40 మీటర్లుగా ఉంది.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

స్వామివారికి ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యాధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలను అందజేశారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

పరవాడ: అనకాపల్లి-గాజువాక జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల కారు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వృద్ధురాలు(60) మృతి చెందింది. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. జాతీయ రహదారిని ఆనుకుని తాడి మూడు మదుంల వద్ద శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందింది. ప్రమాద సమాచారాన్ని తాడి వీఆర్వో కేవీ రమణ ద్వారా అందుకున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి సమాచారం తెలిసిన వ్యక్తులు పరవాడ పోలీసులను సంప్రదించాల్సిందిగా సీఐ కోరారు.

నేటి నుంచి అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం


అయ్యప్పస్వామి


అయ్యప్పస్వామి ఆలయం


అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం అయ్యప్పస్వాములు, భవానీలు, శివభక్తులు, వేంకటేశ్వరస్వామి భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు, కార్యదర్శి ఉప్పల శ్రీనివాసరావు, కోశాధికారి వి.వి.ఎస్.కె.ప్రేరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు ముత్యాల వెంకటేశ్వరరావు, చింతాడ హేమారావు, కమిటీ సభ్యుల ఆర్థిక సాయంతో రోజుకు 400 మంది మాలధారణ భక్తులకు మాత్రమే అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

డిసెంబర్ 29న పూర్వ విద్యార్థుల కలయిక


జీవీఎంసీ చిన్న హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ పదో తరగతి పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ డిసెంబర్ 29న కుటుంబ సమేతంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి దాడి శివరామకృష్ణ, పి.సత్యనారాయణ, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరుకు తగ్గిన వరద ముంపు


పెద్దేరు జలాశయంలో తగ్గిన నీటిమట్టం

మాడుగుల : ఇటీవల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు రెండు రోజుల క్రితం వరకు జలాశయంలోకి 500 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరేది. అయితే ఆదివారం నుంచి జలాశయంలోకి ఇన్ ఫ్లో 150 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రధాన పంటకాలువలకు 140 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తుండడంతో జలాశయం పరిధి 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలకు ఢోకా లేదని జలాశయం అధికారులు చెబుతున్నారు.

సాగరతీరంలో సండే సందడి


తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: గాజువాక, సబ్బవరం, అనకాపల్లి, పరవాడ ప్రాంతాల నుంచి ఆదివారం తరలివచ్చిన సందర్శకులు తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో సందడి చేశారు.ఆదివారండయం తీరాలకు చేరుకున్న సందర్శకులు తీరం అందాలను ఆస్వాదిస్తూ, ఇసుక తిన్నెలపై కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలు, పాటలతో ఉత్సాహంగా గడిపారు. సాయంసంధ్య వేళ వరకు జలకాలాటలతో ఉల్లాసంగా గడిపి, ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

గొలుగొండ : నెల రోజుల క్రితం మరణించిన స్నేహితుడి కుటుంబానికి సహచర స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2000-2001బ్యాచ్‌కు చెందిన దారకొండ శ్రీనివాసరావు నెల రోజులు క్రితం చనిపోవడం జరిగింది. ఆయనకు భార్య, కుమార్తె, కమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి మిత్రులంతా కలిసి ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు.

అధ్వానంగా సబ్బవరం-లంకెలపాలెం రోడ్డు


పైడివాడ అగ్రహారం వద్ద సబ్బవరం-లంకెలపాలెం రోడ్డు దుస్థితి

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-లంకెలపాలెం రోడ్డు అడుగడుగునా భారీ గోతులు ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే భారీ వాహనాలు గోతుల్లో పడి బ్రేక్ డౌన్ అవుతున్నాయి. పరవాడలోని ఎన్టీపీసీతో పాటు పలు పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలు సబ్బవరం మీదుగా ముడి సరకులు, తయారైన ఉత్పత్తులు తరలిస్తూ ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు ఫ్లైయాష్ తరలించే లోడ్ లారీల నుంచి ఫ్లైయాష్ పడి, బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఏర్పడిన గోతుల్ని తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాని వాహనదారులు కోరుతున్నారు.

పెరిగిన తుప్పలు.. రాకపోకలకు తిప్పలు


తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు

పరవాడ: వాడచీపురుపల్లి-తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపులాదట్టంగా పెరిగిన తుప్పలతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు సమీప ప్రాంతాల ప్రయాణికులు వాపోతున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల నిడివి కలిగిన తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపుల దట్టంగా తుప్పలు పెరిగాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువ. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రయాణికులు చెప్తున్నారు. తీరానికి రాకపోకలు సాగించే సందర్శకులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.